నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజాంపేట్: విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో 11 కేవీ నిజాంపేట్, ఎస్ఎంఎస్, ఎస్ఎల్‌జీ, మా విల్లాలు, వెంకట్ ప్రణీత్, తరుణ్ భాస్వానీ ఫీడర్లలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇందిరానగర్, కాకతీయనగర్, బాచుపల్లి జీపీ, షికారా విల్లాలు, ఎస్సీ కాలనీ, బొల్లారం ఇండస్ట్రీయల్ ఏరియా, సాయినగర్ కాలనీ, ఆదిత్య గార్డెన్స్, ప్రణీత్ అపార్ట్‌మెంట్స్, తరుణ్ భాస్వానీ అపార్ట్‌మెంట్స్, మా విల్లాలు, కౌసల్య కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు కొంపల్లికి యాత్ర

కుత్బుల్లాపూర్: శృంగేరి శారదా పీఠానికి చెందిన విధుశేఖర భారతీస్వామి చేపట్టిన ధర్మవిజయ యాత్ర శుక్రవారం కొంపల్లికి చేరుకోనున్నది. ఈ నేపథ్యంలో శ్రీదుర్గాదేవి సేవాసమితి ఆధ్వర్యంలో స్వామిజీకి స్వాగతం పలికి నార్త్ ఎన్‌సీఎల్ కాలనీలో సభ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు చతుర్వేద సదస్సు, వేదస్వస్తి, అనంతరం విధుశేఖర భారతీస్వామిజీకి పాదుకా పూజ, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సభ్యులు కోరారు.

పోలీస్ సిబ్బందికి హెల్మెట్ల అందజేత



సీఐ విజయవర్ధన్‌కు హెల్మెట్ అందజేస్తున్న మోటోవే బైక్ స్టోర్ ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని మోటోవే బైక్ స్టోర్ ఆధ్వర్యంలో పేట్‌బషీరాబాద్ పోలీసులకు గురువారం హెల్మెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ విజయవర్ధన్ మాట్లాడుతూ.. చాలా ప్రమాదాల్లో హెల్మెట్లు ధరించకపోవడంతోనే ప్రాణ నష్టం వాటిల్లిందన్నారు. మోటోవే బైక్‌స్టోర్ ప్రతినిధులు తమ సిబ్బందికి హెల్మెట్లు అందించడం అభినందనీయమన్నారు.

గోదావరి నీరు రోడ్డు పాలు..!



భగత్‌సింగ్‌నగర్‌లో గోదావరి పైపులైన్ నుండి వస్తున్న తాగునీరు

చింతల్: భగత్‌సింగ్‌నగర్‌లో సీసీ రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్ తవ్వకాలు చేపడుతున్నాడు. పనుల్లో భాగంగా తవ్వుతుండగా గురువారం గోదావరి పైప్ లైన్ పగిలిపోయింది. దీంతో ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడింది. లీకేజీతో పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా పోతోంది. సమాచారం అందుకున్న జలమండలి అధికారులు నీటి సరఫరాను నిలిపేసి మరమ్మతులకు ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలలో సీపీఆర్‌పై అవగాహన



కీసర: కీసరలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు 108 సిబ్బంది సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితిలో సీపీఆర్ నిర్వహణ, సీపీఆర్ చేసే క్రమంలో పాటించే నియమనిబంధనల గురించి విద్యార్థులకు వివరించారు. రోడ్డు ప్రమాదాలు, పాముకాటు తదితర అత్యవసర సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 108 ఈఎంటీ శివనాగేశ్వర్‌రావు, పైలట్ ప్రభాకర్, స్కూల్ హెడ్‌మాస్టర్ రాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాప సింగారంలో శ్రీ కంఠ మహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా జరిగింది. గురువారం జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ మేయర్ అమర్‌సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ శివకుమార్, మాజీ సర్పంచ్ వంగూరి శివశంకర్, మాజీ ఉపసర్పంచ్ అబేదాబేగం, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు బద్దం కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



రాష్ట్రబంద్‌కు సహకరించండి



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

బీసీ సంఘాల విజ్ఞప్తి

జగద్గిరిగుట్ట: బీసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ఈనెల 18 నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త బంద్ నేపథ్యంలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ వద్ద గురువారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ అధ్యక్షతన వహించగా బీసీ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల అమలుకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లును ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకతీతంగా ఈనెల 18న చేపట్టనున్న రాష్ట్రబంద్‌కు ప్రతిఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు ఉమా మహేశ్, జిల్లా నాయకులు స్వామి, శ్రీనివాస్, బీసీ నాయకులు సాయికుమార్ పంతుల, నందగిరి సతీశ్, పద్మశాలీ సంఘం నాయకులు పల్లె దత్తాత్రేయ, మాయకోటి ప్రభాకర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రం సంజీవ్, రాష్ట్ర నాయకురాలు రజిత పటేల్, సదానంద్, జానకీరామ్, వేణుగోపాల్, యాదవ సంఘం అధ్యక్షుడు గండి రాజుయాదవ్, శ్రీనివాస్ చారి, కృష్ణ, రజక సంఘం నాయకుడు నరసింహులు, దళిత సంఘం నాయకులు కొమ్ము వెంకటేశ్, దొరవి బాబు, ఏఐటీయూసీ నాయకులు హరినాథ్ రావు, సుంకి రెడ్డి, జంబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లు ఆమోదించాలి

రంగారెడ్డినగర్: చట్టసభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లును ఆమోదించాలని కుత్బుల్లాపూర్ మండల సీపీఎం కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. షాపూర్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్ల సాధనకు శుక్రవారం చలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అదేవిధంగా బీసీ సంఘాల జేఏసీ ఈనెల 18న చేపట్టనున్న తెలంగాణ బంద్‌కు సీపీఎం పూర్తి మద్దతు ఉంటుందన్నారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, రావుల స్వాతి, వెంకయ్య నాగభూషణం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

వర్కింగ్ జర్నలిస్ట్‌లకు కార్పొరేట్ వైద్యమందించాలి

కుత్బుల్లాపూర్: వర్కింగ్ జర్నలిస్టులకు కార్పొరేట్ వైద్యం అందించేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజుగౌడ్ డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూనియన్ సర్వసభ్య సమావేశం, నూతన కమిటీ ఎన్నికలు సూరారంలోని వీఐపీ ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడుతామని చేస్తామన్నారు. ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సాయిబాబా, కోశాధికారి శేషారెడ్డి, కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు శేఖర్, వెంకట్, సిరిగిరి శ్రీనివాస్, నాగేంద్ర చారి, సీనియర్ జర్నలిస్టులు రామారావు, అనిల్, గౌస్, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ నూతన కమిటీ ఎన్నిక



కుత్బుల్లాపూర్ నూతన కార్యవర్గం

అధ్యక్షుడిగా గోలిపల్లి దయాకర్ రెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షుడిగా సాయిబాబా, ప్రధాన కార్యదర్శిగా రెడ్డబోయిన మల్లేశ్‌యాదవ్ ఎన్నికయ్యారు. అలాగే కార్య నిర్వాహక కార్యదర్శులుగా బేరోజు రణదేవ్, శేషారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, ప్రవీణ్, ఎల్లంపల్లి నర్సింహులు, అన్వర్, కోశాధికారిగా శివ శర్మ, సలహాదారులుగా శేఖర్ గుంటూరు, గౌస్ మొయినుద్దీన్, నాగేంద్ర చారి, కె.వెంకట్, లాలయ్య, సిరిగిరి శ్రీనివాస్, కుంట అనిల్, ఉపాధ్యక్షులుగా సీతారామారావు, కలికి మూర్తి, శ్రీధర్, పత్రాల సురేశ్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మణ్, సంతోష్,. ఎండీ లియాకత్ అలీ, గ్రంధాలు, నవీన్ రాజు, సంతోష్, నాగబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అరకొర నీటి సరఫరాతో అవస్థలు..!

జర్నలిస్టుకాలనీలో నీటి కటకట

నిజాంపేట్ : 'పేరు గొప్ప.. ఊరు దిబ్బ' అన్నట్లుగా తయారైంది నిజాంపేట్ జర్నలిస్టు కాలనీ పరిస్థితి. 20 రోజుల క్రితం వరకు నీటి సరఫరా బాగానే జరిగినప్పటికీ ఆ తర్వాత నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతోంది. రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయాల్సి ఉండగా 4 రోజులకోసారి సరఫరా చేస్తున్నారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన లైన్‌మెన్ కాలనీవాసుల అవసరాలకు మేరకు నీటిని వదిలేవారు. అయితే 20 రోజుల నుంచి పాత లైన్‌మెన్ స్థానంలో కొత్తవారు రావడంతో వారికి ఏమాత్రం అవగాహన లేదు. ఏ వాల్వ్ ఓపెన్‌చేస్తే ఎటువైపు నీరు వెళ్తాయో తెలియడం లేదు. ఫలితంగా కొంతమందికి నీరు వస్తే, మరికొంతమందికి నీటి సరఫరా కావడం లేదు. ఒకవేళ నీరు వచ్చినాలో ప్రెషర్‌తో అరగంట పాటు ఇచ్చి బంద్ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై జలమండలి సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా జలమండలి సిబ్బంది స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని జర్నలిస్టు కాలనీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కర్ల లాలయ్య, కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో 'స్టెమ్‌ల్యాబ్' ప్రారంభం



ప్రారంభ కార్యక్రమంలో ఆప్టమ్‌ఇండియా, హోప్ ఫౌండేషన్, విద్యాకమిటీ సభ్యులు, టీచర్లు

రాయదుర్గం: ఆప్టమ్ ఇండియా, హోప్ ఫౌండేషన్ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన 'స్టెమ్ ల్యాబ్'ను గురువారం రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఆప్టమ్ ఇండియా ప్రతినిధి నితిన్ కశ్యప్, శేరిలింగంపల్లి మండల విద్యాధికారి వెంకటయ్య ప్రారంభించారు. దీంతో పాటు స్మార్ట్ టీవీ, అన్ని తరగతులకు కావాల్సిన కాంటెంట్‌ని కూడా అందించారు. దీనిలో భౌతిక శాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం సంబంధించిన అన్ని ప్రయోగాలకు కావాల్సిన పరికరాలు, మోడల్, రసాయనాలు, కాంటెంట్ చార్ట్‌లు ఉన్నాయి. ఎంఈఓ వెంకటయ్య మాట్లాడుతూ ఎన్‌జీఓ సంస్థలకు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం హర్షణీయమన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



నాగారంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సుర్వి బాబయ్యగౌడ్ గార్డెన్స్‌లో కమిషనర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. గురువారం 'అంగీకార్-2025' పేరుతో కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి పథక ప్రయోజనాలు గురించి వివరించారు. మాజీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ మేనేజర్ నారాయణ రెడ్డి, డీఈఈ సంతోష్‌కుమార్, రెవెన్యూ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిరాజ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ శ్రవణ్‌కుమార్, వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

మేడ్చల్: మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భూపాల్ పాల్గొని సమాచార హక్కు చట్టం గురించి వివరించారు. సదస్సుకు హాజరైన వారికి చట్టంపై అవగాహన కల్పించారు. చట్టం వల్ల చేకూరే ప్రయోజనాలు, చట్టం వల్ల సాధించే విషయాలపై వివరించారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది గుడ్ గవర్నెన్స్ టీమ్ సభ్యులు చందర్, రమేష్‌గుప్తా, ఆజామ్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో తహసీల్దార్ భూపాల్ తదితరులు

20 నుంచి దీక్షాపరులకు భిక్ష

కుత్బుల్లాపూర్: బీరప్పనగర్‌లోని కామరాతి సమేత బీరప్పస్వామి ఆలయంలో ధర్మ శాస్త అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్షాపరులకు 41వ రోజుల పాటు భిక్ష ఏర్పాటు చేయనున్నట్లు ప్రెసిడెంట్ కావడి గోపాల్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి డిసెంబర్ 1 వరకు ప్రతిరోజు ఆలయ ప్రాంగణంలో భిక్ష ఉంటుందని, దీక్షాపరులు విచ్చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని సభ్యులు కోరారు.

ప్రత్యేకావసరాల విద్యార్థులకు హెచ్‌ఈసీలో అడ్మిషన్లు

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం ప్రత్యేక అవసరాల గల విద్యార్థులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ నాగేంద్ర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చెవిటితనం ఉన్న విద్యార్థులు, చెవులు బాగా వినపడని విద్యార్థులు, మానసిక మాంద్యమున్న, బుద్ధి వికలాంగ విద్యార్థులను హెచ్‌ఈసీ గ్రూప్‌లో చేర్చుకునేందుకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పార్క్ చేసిన ద్విచక్ర వాహనం అపహరణ

ఘట్‌కేసర్: ఇంటిముందు నిలిపిన బైక్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. డీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన బంగారు చంద్రశేఖర్ 8న (టీఎస్08జేడబ్ల్యూ7743) హోండా యాక్టీవా ఇంటి ముందు పార్కు చేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం తిరిగి ఇంటికి వచ్చి చూడగా.. ఇంటి ముందు నిలిపిన వాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మేడ్చల్‌రూరల్: ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ చెక్‌పోస్టులోని తనుజాలాడ్జ్ సమీపంలో ఉదయం 11గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు పక్కన పడి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు మేడ్చల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు 40-45 ఏళ్లున్న వ్యక్తిగా గుర్తించారు. ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగవరం అభివృద్ధికి నిధులు కేటాయించాలని గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు. నగరంలోని మంత్రి నివాసానికి మాజీ జెడ్పీటీసీ శైలజ, మాజీ సర్పంచ్ విజయానంద్‌రెడ్డిలు గ్రామ కాంగ్రెస్ నేతలతో కలిసి వెళ్లారు. గ్రామంలోని సమస్యలను వివరించి తగిన నిధులు మంజూరు చేయాలని కోరారు. కాంగ్రెస్ నేతలు ప్రకాష్‌రెడ్డి, మనస్వినిరెడ్డి తదితరులున్నారు.

దిష్టిబొమ్మ దహనం

జవహర్‌నగర్: కార్పొరేషన్‌లో ఎన్నో ఏళ్ల నుంచి ఉంటున్న ఇళ్లను ప్రభుత్వం కూల్చడాన్ని నిరసిస్తూ.. బీజేపీ నేతలు గురువారం జవహర్‌నగర్ ప్రధాన రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో ఏళ్ల నాటి నుంచి నివాసం ఉంటున్న కాలనీలోకి రెవెన్యూ అధికారులు వచ్చి అక్రమమంటూ.. కూల్చడంతో పేదలు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారన్నారు. నాయకులు శంకర్, సంతోష్‌గుప్తా, లిఖితయాదవ్, సన్నీ, యాదగిరి, మహేష్‌గౌడ్, నరేష్‌యాదవ్, నవీన్, జ్యోతి, రాజునాయక్, శివప్రసాద్ పాల్గొన్నారు.

కార్యకర్తలు సమష్టిగా పని చేయాలి



మాట్లాడుతున్న ఏఐసీసీ అబ్జర్వర్ అంజలి నింబాల్కర్

సుభాష్‌నగర్: కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని ఏఐసీసీ అబ్జర్వర్ అంజలి నింబాల్కర్ సూచించారు. జిల్లా అధ్యక్షుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హనుమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. టీపీసీసీ అబ్జర్వర్ సింగాపురం ఇందిరాతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ.. సీనియర్ నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు జిల్లా అధ్యక్షులను ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. అంజలి నింబాల్కర్ మాట్లాడుతూ.. కార్యకర్తలు సమష్టిగా పని చేసి రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ బి.బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, సీనియర్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి, బొంగునూరి కిశోర్ రెడ్డి, కందడి శివా రెడ్డి, అవిజే జేమ్స్, దమ్మని శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం



సుభాష్‌నగర్: గాజులరామారంలోని సీఎంఆర్ హైస్కూల్‌లో గురువారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చెఫ్‌ల అవతారమెత్తారు. పోషక విలువలతో కూడిన విభిన్న రుచుల ఆహారాన్ని తయారు చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోత్స్న మాట్లాడుతూ.. ప్రపంచంలోనే మన దేశ ఆహార అలవాట్లకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఉత్తమ వంటకాలు రూపొందించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి, ఏఓ సత్తిబాబు, వైస్ ప్రిన్సిపాల్ మోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారుల బస్తీబాట

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్‌లో విద్యుత్ శాఖ సిబ్బంది గురువారం బస్తీబాట చేపట్టారు. ఏఈ చైతన్య భార్గవ్ ఆధ్వర్యంలో సిబ్బంది బాలయ్యనగర్‌లోని వీధుల్లో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీలో త్రీఫేజ్ లైన్ లేక లోఓల్టేజీ సమస్య ఉందని, అదేవిధంగా మీటర్లు సరిగా పనిచేయడం లేదని పలువురు స్థానికులు వారి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఏఈ పరిష్కరిస్తామని హామీనిచ్చారు. బాలయ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, కమిటీ సభ్యులు ఉన్నారు.



బాలయ్యనగర్‌లో ఏఈ చైతన్యభార్గవ్, సిబ్బంది

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: అనుమానాస్పదంగా ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన గౌతం చరణ్‌ఘడీ, ఆనందిత మెహతా (26) భార్యాభర్తలు. వీరి 6 నెలల క్రితం బతుకు దెరువు కోసం నగరానికి వలసవచ్చి పేట్‌బషీరాబాద్‌లోని అపర్ణ గ్రీన్స్ ప్రైసెస్ సమీపంలో లేబర్ కాలనీలో ఉంటున్నారు. ఈనెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో ఆనందిత మెహతా ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

మానసిక సమస్యతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లికి చెందిన సాదిక్ మన్సూర్ (45) నిరుద్యోగి. ఇంటి వద్దే ఉంటూ మానసిక సమస్యతో బాధ పడుతున్నాడు. మతిస్థిమితం సరిగా లేకపోవడంతో మానసికంగా కృంగిపోయిన మన్సూర్ గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టీల పేరిట ఘరానా మోసం

నిజాంపేట్‌లో ఘటన

నిజాంపేట్ : చిట్టీల పేరిట ఓ ఆర్ఎంపీ వైద్యుడు, అతని అకౌంటెంట్ ఘరానా మోసం చేశారు. ఈ విషయం సభ్యులకు అర్థమయ్యేలోపే దొంగను నేను కాదంటే నేను కాదని ఆర్ఎంపీ వైద్యుడు ఆత్మహత్యలకు పాల్పడగా, అకౌంటెంట్ మాత్రం తాను కూడా ఆత్మహత్య చేసుకుంటాను అంటూ ఓ సూసైడ్ నోట్‌రాసి అదృశ్యమయ్యాడు. అయితే సభ్యుల దృష్టిని మరల్చేందుకే ఈ నాటకానికి తెరలేపారనే సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాచుపల్లి పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ పరిధిలోని మయూరినగర్‌కు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు అలీ నిజాంపేట్‌లోని గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి బండారీ లే అవుట్ కాలనీకి వెళ్లే దారిలో రేష్మా క్లీనిక్ పేరుతో 20 ఏండ్లుగా దవాఖాన నడుపుతున్నాడు. స్థానికంగా మంచి పేరు ఉండడంతో చిట్టీల వ్యాపారం మొదలుపెట్టాడు. గత పదేండ్లుగా క్లీనిక్, చిట్టీల వ్యాపారాన్ని సమాంతరంగా నడుపుతున్నాడు. క్రమంగా కాలనీ పెరగడం, కస్టమర్లు పెరగడంతో కొన్నేండ్లుగా రూ.50 లక్షలు, రూ.30 లక్షలు, రూ.20 లక్షల చిట్టీలు నిర్వహిస్తున్నాడు. సుమారు 150 మంది కస్టమర్లు చిట్టీలు వేస్తున్నారు. అయితే పనిభారం పెరగడంతో అకౌంట్స్ చూసుకునేందుకు బండారీ లే అవుట్ కాలనీకి చెందిన మహేశ్‌ను అకౌంటెంట్‌గా నియమించుకున్నాడు. రెండేళ్లుగా చిట్టీల డబ్బులు వసూలు కాకపోవడం, ఎత్తుకున్న వారికి డబ్బులు ఇవ్వకపోవడంతో కస్టమర్లల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో గడిచిన 4 నెలలుగా చిట్టీలు ఎత్తుకున్న వారిలో ఎవరికీ కూడా డబ్బులు ఇవ్వలేదు. ఈ విషయం కస్టమర్లకు తెలిసి, తమ డబ్బులు తమకు ఇవ్వాలంటూ అలీపై ఒత్తిడి తెచ్చారు. ఇది భరించలేక ఈనెల 3న తన క్లీనిక్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అందులో పనిచేసే సిబ్బంది, అతని కుటుంబ సభ్యులు వెంటనే హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. అలీ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. చికిత్స అనంతరం అలీ ఈనెల 14 నుంచి మళ్లీ క్లీనిక్‌కు వస్తుండడంతో మరోసారి బాధితులు తమ చిట్టీ డబ్బుల కోసం క్లీనిక్‌కు, నివాసానికి క్యూ కట్టారు. చిట్టీలకు సంబంధించిన కోట్లాది రూపాయల డబ్బులు ఏమయ్యాయనే విషయమై అలీ, అకౌంటెంట్ మహేశ్ మధ్య వివాదం నడుస్తోంది. ఇదిలా ఉండగా గురువారం ఉదయం మహేశ్ తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ ఓ సూసైడ్ నోట్ ఇంట్లో వదిలి బయటకు వెళ్లాడు. దీంతో మహేశ్ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ విషయం బయటపడడంతో గురువారం సాయంత్రం పెద్ద సంఖ్యలో బాధితులు రేష్మా క్లీనిక్ వద్దకు చేరుకుని అలీని నిలదీశారు. దీంతో అలీ తనను అకౌంటెంట్ మోసగించాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా, బాధితులు మాత్రం అలీ తమను మోసం చేశారని కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు నష్టపోయిన మొత్తం కోట్లల్లో ఉంటే కేసును ఆర్థిక నేరాల విభాగానికి అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

ప్లాస్టిక్ కంపెనీలో అగ్ని ప్రమాదం

కుత్బుల్లాపూర్: ప్లాస్టిక్ కవర్లు తయారుచేసే కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. స్టేషన్ పరిధిలోని దూలపల్లిలో గల చైనా బజార్‌లోని పాలీమార్ ప్లాస్టిక్ కంపెనీలో గురువారం రాత్రి అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా చుట్టు పక్కల కంపెనీల కార్మికులను 2 అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు యత్నించారు. మంటలు వ్యాపించడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



భారీగా ఎగిసిపడుతున్న మంటలు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029